నమస్తే తెలంగాణ

# రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ చేసిందేమీ లేదు

- చొప్పదండి ఎమ్మెల్యే రవిశంకర్
- నర్సింహులపల్లిలో జీపీ భవనం, సీసీ రోడ్లకు భూమి పూజ



నర్సింహులపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

కొడిమ్యాల, అక్టోబర్ 7 : రాష్ట్రానికి కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు చేసింది ఏమీ లేదని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ విమర్శించారు. దమ్ముంటే కాంగ్రెస్ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రూ. 2 వేల పింఛన్ అమలు చేసి తెలంగాణలో ఓట్లు అడగాలని సవాల్ విసిరారు. మండలంలోని నర్సింహులపల్లి గ్రామంలో శనివారం 20 లక్షలతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనం, రూ.13 లక్షలతో చేపట్టి సీసీ రోడ్లు పనులకు శంకుస్థాపన చేసి, రూ. 50 వేల విలువైన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికి రోల్ మోడల్‌గా తయారు చేస్తుంటే కాంగ్రెస్, బీజేపీ నాయకులకు మింగుడు పడడం లేదన్నారు. ఆ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే వారు పాలిస్తున్న రాష్ట్రాల్లో వృద్ధులకు రూ.2 వేల పింఛన్, కల్యాణలక్ష్మి, రైతుబీమా, రైతు బంధు పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పారిశుధ్యంపై జాతీయ స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి 17 అవార్డులు వచ్చినట్లు చెప్పారు. 2014 ఎన్నికల్లో సిలిండర్ ధర రూ.400 ఉంటే ప్రస్తుతం రూ.1200 అయిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు మోదీకి ఇష్టం లేదన్నారు. మోదీ నోరు తెరిస్తే పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ పునుగోటి ప్రశాంతి, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు పునుగోటి కృష్ణారావు, సింగిల్ విండో చైర్మన్లు మేన్నేని రాజనర్సింగారావు, పోలు రాజేందర్, స్థానిక సర్పంచ్ ఏగుర్ల తిరుపతి, గౌరాపూర్ సర్పంచ్ బొడ్డు విజయలక్ష్మి, ఎంపీవో ప్రవీణ్, నాయకులు బొడ్డు రమేశ్, కాయిత రాజు ఉన్నారు.

## పెగడపల్లి మండలానికి అంబులెన్స్

నేడు ప్రారంభించనున్న మంత్రి ఈశ్వర్

పెగడపల్లి, అక్టోబర్ 7: మండలంలో అత్యవసర సమయంలో వైద్య సేవలందించేందుకు ఉచిత అంబులెన్స్ వాహన సౌకర్యాన్ని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవ తీసుకొని మంజూరు చేశారు. గడ్డం రాజారెడ్డి జ్ఞాపకార్థం అంబులెన్స్ సౌకర్యం ఏర్పాటు చేయగా, ఆదివారం మంత్రి ఈశ్వర్ ప్రారంభించనున్నారు. మండలానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించడం పట్ల మంత్రి ఈశ్వర్‌కు మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## నేడు మండలంలో మంత్రి ఈశ్వర్ పర్యటన

పెగడపల్లి, అక్టోబర్ 7: మండలంలో ఆదివారం మంత్రి ఈశ్వర్ పర్యటిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నర్సింహునిపేటలో గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, ఎల్లాపూర్, సుద్దపల్లి, వెంగళాయిపేటలో పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభిస్తారని పేర్కొన్నారు. మండలంలోని పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

## సేవాలాల్ ఆలయానికి విరాళం

కథలాపూర్, అక్టోబర్ 7 : రాజారం తండాలో సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి శనివారం ఇద్దరు దాతలు విరాళం అందించినట్లు సర్పంచ్ లౌడియా సరిత తెలిపారు. భూక్యా తిరుపతి, కీమ్యా నాయక్ రూ. లక్ష, లౌడియా చందునాయక్, (సరిత–రవీందర్) రూ. 50 వేలు విరాళంగా ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా దాతలను గ్రామస్తులు శాలువాలతో సన్మానించారు.

## హరితగణాంక సూచిలో ర్యాంకు

జగిత్యాల టౌన్, అక్టోబర్ 7 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల 2022–23 సంవత్సరానికి గాను హరిత గణాంకసూచిలో అత్యున్నతమైన ర్యాంకు సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యనారాయణ పేర్కొన్నారు. హరిత గణాంక సూచిలో అత్యున్నతమైన ర్యాంకు సాధించడానికి సహకరించిన సూచి కన్వీనర్ అసోసియేట్ ప్రొఫెసర్ జ్యోతిలక్ష్మి, సభ్యులు మానస, డాక్టర్ పడాల తిరుపతికి ప్రిన్సిపాల్ మెమెంటో అందించి అభినందించి మాట్లాడారు. హరిత హారంలో భాగంగా కళాశాలలో గ్రీన్ కవర్, బొటానికల్ గార్డెన్ మెడిసినల్ అండ్ హెర్బల్ గార్డెన్ ఏర్పాటు, మొక్కలను సంరక్షించడంలో గ్రీన్ ఆడిట్ సెల్ కన్వీనర్ సలహాలు, సూచనలతో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గ్రీన్ ఆడిట్ సెల్ సభ్యులు కలిసి చేసిన కృషికి గాను కళాశాలకు బీ ప్లస్ ప్లస్ ర్యాంకు వచ్చిందన్నారు. సామాజిక అడవుల పెంపకంలో భాగంగా కళాశాలలో మొక్కలు నాటి సంరక్షించామని చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ ఆడిట్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

## గుడుంబా నియంత్రణకు ప్రత్యేక చర్యలు

జగిత్యాల, అక్టోబర్ 7 : జిల్లాలో గుడుంబాను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎక్సైజ్ ఎస్పీ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 7 వరకు 32 గుడుంబా కేసులను గుర్తించి, 23 మందిని అరెస్టు చేశామన్నారు. 95 లీటర్ల గుడుంబా, 50 కిలోల బెల్లం, 670 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని తెలిపారు. 2 ద్విచక్రవాహనాలు సీజ్ చేసి, రెండు బెల్టు షాపులపై కేసులు నమోదు చేసి 2.88 లీటర్ల బీరు సీసాలు, 2.60 లిక్కర్ లీటర్ల సీజ్ చేసి ఇద్దరిని అరెస్ట్ చేశామన్నారు. ఎక్సైజ్ నేరాలు చేసిన 81 మందిని సంబంధిత తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశామని వెల్లడించారు. గుడుంబా తయారీ, సరఫరా, రవాణా, గంజాయి, అక్రమ మద్యం సరఫరా తదితర నేరాలను నియంత్రించుటకు రెవెన్యూ, పోలీస్ శాఖతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం, జిల్లా టాస్క్ ఫోర్స్, స్టేషన్ సిబ్బందితో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి

పెగడపల్లి, అక్టోబర్ 7: సుద్దపల్లికి చెందిన కాల్వ పరశురాం (29) శనివారం విద్యుదాఘాతంతో దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామ సమీపంలోని తన పొలం వద్దకు నీళ్లు పెట్టేందుకు వెళ్లిన పరశురాం మోటర్‌ను మరమ్మతు చేస్తుండగా షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య రాజ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సతీశ్ పేర్కొన్నారు. పేద వర్గానికి చెందిన పరశురాం కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నేరెళ్ల హారిక–గంగాధర్ కోరారు.

## పట్టు పురుగుల పెంపకంపై రైతులకు శిక్షణ

జగిత్యాల టౌన్, అక్టోబర్ 7 : పొలాస ప్రాంతీయ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి 7వ తేదీ వరకు పట్టు పురుగుల పెంపకంపై రాష్ట్రంలోని పలు గ్రామాల నుంచి ఎంపిక చేసిన 30 మంది రైతులకు శిక్షణ ఇచ్చారు. మొదటి మూడు రోజులు కళాశాలోని అధ్యాపకులు పట్టు పురుగుల పెంపకం , మల్బరీ తోటల సాగుపై వివరించారు. పట్టు పురుగుల పెంపకం చేపడుతున్న కళాశాలలోని చివరి సంవత్సరం విద్యార్థుల ఏఈఎల్‌పీ యూనిట్‌ను రైతులు సందర్శించారు. జనగామలోని పట్టు గూళ్ల విక్రయ కేంద్రానికి తీసుకెళ్లి నాణ్యత పరీక్ష, వాటి వేలం గురించి వివరించారు. అదే ప్రాంతంలో ఓ రైతు పొలంలో చేపడుతున్న పట్టు పురుగుల యూనిట్‌ను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. శనివారం ముగింపు కార్యక్రమంలో భాగంగా అసోసియేట్ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ కళాశాల డాక్టర్ భారతి నారాయణభట్ వ్యవసాయం, అనుబంధ రంగాల ప్రాధాన్యత గురించి వివరించారు. ఏడీఆర్ డాక్టర్ జీ శ్రీనివాస్ పట్టు పురుగుల పెంపకం వాటి లాభాలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు హేమలత– విజయరాఘవన్, డాక్టర్ రత్నాకర్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావుకు ఆత్మీయ సన్మానం



ఎమ్మెల్యే దంపతులను సన్మానిస్తున్న పాలకవర్గం

మెట్‌పల్లి, అక్టోబర్7: మెట్‌పల్లి మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, అధికారులు, సిబ్బంది ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు– సరోజన దంపతులను గజమాలతో సన్మానించారు. శనివారం మున్సిపల్ సమావేశం మందిరంలో చైర్‌పర్సన్ రాణవేని సుజాత అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా విద్యాసాగర్‌రావు మెట్‌పల్లి మున్సిపల్ అభివృద్ధి కోసం ఎనలేని సేవలు అందించారని కౌన్సిలర్లు కొనియాడారు. అభివృద్ధిలో మెట్‌పల్లిని ముందంజలో నిలిపేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు కౌన్సిల్ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని చైర్‌పర్సన్ సుజాత పేర్కొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కౌన్సిలర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్‌రావు, కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు సజావుగా జరిగేలా యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలి

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- ఎన్నికల నిర్వహణపై మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా

జగిత్యాల కలెక్టరేట్, అక్టోబర్ 7 : అసెంబ్లీకి త్వరలో జరుగనున్న ఎన్నికలు సజావుగా నిర్వహించేలా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎన్నికల నిర్వహణపై నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు శనివారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై ఎలక్షన్ కమిషన్ ఇటీవలే జిల్లా ఎన్నికల అధికారులతో సమీక్షించిందన్నారు. ఎలక్షన్ విధులు నిర్వహించే ప్రతి అధికారి, సిబ్బంది ఎలక్షన్ కమిషన్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను మాస్టర్ ట్రైనర్లు నియోజకవర్గాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి ఎలక్షన్ విధులు నిర్వహించే ఆయా టీంలకు వివరించాలన్నారు. ఎలక్షన్ కమిషన్ నియమనిబంధనలు, శిక్షణలో అందించిన విషయాలపై పుస్తకాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి మాస్టర్ ట్రైనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. తిరుపతి, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు ఎంపీడీవోలు నవీన్‌కుమార్, సంతోష్‌కుమార్, అసెంబ్లీ నియోజకవర్గాల మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

# ఆడపడుచులకు సీఎం కానుక బతుకమ్మ చీర



మెట్‌పల్లి: చీరెలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత



కోరుట్ల: మహిళలకు చీరెలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య



కోరుట్ల రూరల్ : పైడిమడుగులో పంపిణీ చేస్తున్న సర్పంచ్ భీంరెడ్డి

కోరుట్ల, అక్టోబర్ 7: తెలంగాణ ఆడబిడ్డలకు ముఖ్యమంత్రి కేసీఆర్ బతుకమ్మ కానుకగా చీరలను అందజేస్తున్నారని మున్సిపల్ అధ్యక్షురాలు అన్నం లావణ్య పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని 26వ వార్డులో మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చీరల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మహిళలకు బతుకమ్మ చీరెలు అందజేశారు. కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

మేడిపల్లి, అక్టోబర్ 7 : మేడిపల్లి, భీమారం మండల కేంద్రాలతోపాటు కట్లకుంట, కాచారం, వెంకట్రావుపేట, దమ్మన్నపేటలో శనివారం ఆయా గ్రామాల సర్పంచులు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు గడ్డం నారాయణరెడ్డి, చెక్కపెల్లి అరుణ, కాటిపెల్లి జగన్‌రెడ్డి, చిట్యాల సురేశ్, ఎంపీటీసీలు పన్నాల లావణ్య, రాజేశ్వర్‌రెడ్డి, పల్లి అర్జున్, సుధవేని లక్ష్మి, భూమేశ్‌గౌడ్, ఉపసర్పంచులు నూతిపెల్లి శంకర్, బసవరాజుల రాజు, పంచాయతీ కార్యదర్శి ఆదిరెడ్డి, నాయకుడు చెక్కపెల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి,అక్టోబర్7: మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో శనివారం మహిళలకు ప్రజాప్రతినిధులు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారు. కౌన్సిలర్లు అయ్యోరి వేణు, తరాల కార్తీక్, గుర్రాల సుధాకర్, వొడ్నాల ఉమాలక్ష్మి, కొంపల పద్మ, బండారి అశోక్, యూనుస్, అనంతుల విజయలక్ష్మి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ అలీమ్, వసంత్, ఉజ్మా తబ్సుమ్–షబ్బీర్ తదితరులు ఉన్నారు.

కోరుట్ల రూరల్, అక్టోబర్ 7 : పైడిమడుగులో సర్పంచ్ దమ్మ భీంరెడ్డి మహిళలకు బతుకమ్మ చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ లాస్య, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి,అక్టోబర్7:ప్రభుత్వ కానుకగా మహిళలకు బతుకమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత అన్నారు. శనివారం మెట్‌పల్లి పట్టణంలోని 19,26వ వార్డుల్లో సూర్యోదయ పాఠశాల ఆవరణలో మహిళలకు చీరెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, రవీందర్, విజయ్, గీత, లక్ష్మి, రాజేశ్ పాల్గొన్నారు.